సాక్షి అనకాపల్లి

సోమవారం । 20 । ఫిబ్రవరి । 2023



సంగీత ఝరి.. పేలూరి

సంగీత కళారంగంలో తండ్రికి తగ్గ తనయుడిగా పేలూరి వెంకట నారాయణరావు శభాష్ అనిపించుకుంటున్నారు. 8లో



సాగర తీరంలో సాహసక్రీడలు

విశాఖలో వాటర్ స్పోర్ట్స్, సాహస క్రీడలు పరిచయం చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. 8లో

సరుగుడు వద్ద సందడి



సరుగుడు జలపాతానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. 8లో

న్యూస్‌రీల్

జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్‌లో ఉపాధ్యాయుడి ప్రతిభ



రజత పతకం, ప్రశంసా పత్రాన్ని అందుకుంటున్న తెనుగుపూడి హైస్కూల్ ఉపాధ్యాయుడు రవి ప్రతాప్

దేవరాపల్లి: జాతీయ మాస్టర్ అథ్లెటిక్స్ పోటీల్లో మండలంలోని తెనుగుపూడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయుడు ఎ.రవి ప్రతాప్ సత్తా చాటారు. హైజంప్‌లో రజత పతకం పతకాన్ని కై వసం చేసుకున్నారు. హర్యానా రాష్ట్రం కురుక్షేత్రలోని ద్రోణాచార్య నేషనల్ స్పోర్ట్స్ స్టేడియంలో మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 17న నేషనల్ మాస్టర్ అథ్లెటిక్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. హైజంప్‌లో రవిప్రతాప్ ద్వితీయ స్థానాన్ని కై వసం చేసుకున్నారు. మాస్టర్ అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు సురేష్ కుమార్ శర్మ, రాంపాల్ శర్మ చేతుల మీదుగా రజత పతకంతో పాటు ప్రశంసా పత్రాన్ని ఆయన అందుకున్నారు. 45 సంవత్సరాల వయసు పైబడిన క్రీడాకారుల విభాగంలో దేశంలోని 18 రాష్ట్రాల నుంచి 24 మంది పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన రవి ప్రతాప్‌ను తెనుగుపూడి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు జి.ఉమాశంకర్, సహచర ఉపాధ్యాయులు అభినందించారు.

ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకర పంటలు



ప్రకృతి వ్యవసాయంపై అవగాహన ర్యాలీ

ఎస్.రాయవరం: ప్రకృతి వ్యవసాయంతో ఆరోగ్యకరమైన పంటలు, మంచి దిగుబడులు వస్తాయని అనకాపల్లి జిల్లా ప్రకృతి వ్యవసాయం ప్రాజెక్టు మేనేజర్ లచ్చన్న అన్నారు. గోకులపాడు గ్రామంలో ఆదివారం ప్రకృతి వ్యవసాయం-సాగువిధానాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తొలకరి వర్షాలకు ముందు పంట పొలాల్లో పచ్చిరొట్ట, ఎరువులు వేసి కలియ దున్నాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయండి.. ఆరోగ్యకర ఉత్పత్తులను తినండి, నవధాన్యాల సాగు.. నేలతల్లి బాగు అనే నినాదాలు చేస్తూ రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్వయం సహాయక సంఘ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చురుగ్గా ఏలేరు కాలువ గట్టుకు మరమ్మతులు



చినగొలుగొండపేట, రాజుపేట అగ్రహారం మధ్య ఏలేరు కాలువ గట్టు పటిష్ట పనులు

నాతవరం: భారీ వర్షాలకు శిథిలమైన ఏలేరు కాలువ గట్టు పటిష్ట పనులు చురుగ్గా సాగుతున్నాయి. కాకినాడజిల్లా ఏలేశ్వరం రిజ ర్వాయ రు నుంచి అనకాపల్లి జిల్లా మీదుగా విశాఖపట్నం వరకు నీటిని తరలించేందుకు 154 కిలోమీటర్ల పొడవున ఏలేరు కాలువ ఉంది.గత ఏడా ది వర్షాలు అధికంగా కురవడంతో కాలువ గట్టు అనేక చోట్ల శిథిలమై ప్రమాదాలకు నిల యంగా మారింది. కాలువను బాగు చేసేందుకు ప్రభుత్వం రూ. 50 లక్షలు మంజూరు చేసింది. ఈ నిధులతో ఏలేరు కాలువకు మరమ్మతులు యుద్ధప్రాతిపదికన చేస్తున్నారు. రాత్రి వేళల్లో నీటి ప్రవహాన్ని పరిశీలించేందుకు కాలువ గట్టుపై సిబ్బంది వాహనాలపై వెళ్లే విధంగా రోడ్డు తయారు చేస్తున్నారు.

22న జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయంలో ఈనెల 22న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా సబ్ రీజినల్ ఎంప్లాయ్‌మెంట్ (ఎస్సీ,ఎస్టీ) అధికారి నిట్టల శ్యామ్ సుందర్ తెలిపారు. శివశంకర్ మోటార్స్(టాటా మోటార్స్)లో 50 ఉద్యోగాల భర్తీకి ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, టీమ్ లీడర్స్, టెక్నీషియన్స్, సర్వీస్ అడ్వైజర్లు, పెయింటర్స్, డెంటర్, టెలికాలర్స్, సర్వేయర్స్, మేనేజర్స్ ఉద్యోగాలకు ఇంటర్మీడియేట్, ఏదైనా డిగ్రీ, ఐటీఐ,డిపమో, బీకామ్(టాలీ)లో ఉత్తీర్ణత సాధించి 18-35 సంవత్సరాల వయసు గల పురుష, మహిళా అభ్యర్థులు అర్హులన్నారు. ఆయా ఉద్యోగాలకు జీతం నెలకు రూ.12,000 నుంచి రూ.35,000లు ఉంటుందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ncr.gov.in వెబ్‌సైట్‌లో పేర్లు రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు.

స్మార్ట్‌గా పల్లె వెలుగు

- 201 బస్సుల్లో డిజిటల్ సేవలు
- పల్లె వెలుగు బస్సులు 74
- ఎక్స్‌ప్రెస్, డీలక్స్, అల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ బస్సులు 127



స్మార్ట్ టికెట్ ఇస్తున్న ఆర్టీసీ కండక్టర్

సాక్షి, అనకాపల్లి: ప్రజా రవాణా శాఖ (ఆర్టీసీ) పూర్తి స్థాయిలో డిజిటల్ సేవలను అందిస్తోంది. సాంకేతికతకు అనుగుణంగా.. సాధారణ టిక్కెట్ల స్థానంలో స్మార్ట్ టికెటింగ్ మిషన్లను అందుబాటులోకి తెచ్చింది. చిల్లర సమస్య లేకుండా.. నగదురహిత లావాదేవీలకు చర్యలు చేపడుతోంది. తొలుత దూరప్రాంత సర్వీసులకు యూటీఎస్ (యూనిఫైడ్ టికెటింగ్ సొల్యూషన్) విధానం అందుబాటులోకి తెచ్చిన ఆర్టీసీ.. తర్వాత జిల్లాలోని అన్ని ఎక్స్‌ప్రెస్, డీలక్స్, అల్ట్రా డీలక్స్, ఏసీ బస్సులకు విస్తరింపజేసింది. ఇప్పుడు పల్లె వెలుగు బస్సుల్లో కూడా అంచలంచెలుగా అందుబాటులోకి తెచ్చింది.

రెండు విడతల్లో పూర్తిగా యూటీఎస్ అమలు

అనకాపల్లి, నర్సీపట్నం డిపోల పరిధిలో తొలి విడతలో 101 బస్సుల్లో, రెండో విడతలో 100 బస్సు సర్వీసుల్లో యూటీఎస్ విధానం అమలు చేశారు. ఈ సౌకర్యం ఉన్న బస్సుల్లో డెబిట్, క్రెడిట్ కార్డుతో టికెట్ కొనుగోలు చేయవచ్చు. ఫోన్ పే, గూగుల్ పే, పేటీఎం యాప్ సహాయంతో క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి డబ్బులు చెల్లించవచ్చు. ఆ డబ్బు నేరుగా సంబంధిత డిపో అకౌంట్‌కి జమ అవుతుంది. ముఖ్యంగా బస్సులో ప్రయాణిస్తూనే మరో స్టేజ్ నుంచి ఇంకో బస్సులో ప్రయాణించేందుకు టికెట్ బుక్ చేసుకునే సదుపాయం ఉంది.

సిబ్బందికి అవగాహన

స్మార్ట్ మిషన్ల వినియోగంపై ఆర్టీసీ అధికారులు సిబ్బందికి అవగాహన కల్పిస్తున్నారు. స్మార్ట్ మిషన్ల చార్జింగ్‌కు అనుకూలంగా చర్యలు చేపట్టారు. దూరప్రాంత ప్రయాణికుల స్టేజ్ టు స్టేజ్ రిపోర్టు సిబ్బందికి అందుబాటులోకి రానుంది. దీంతో ఖాళీ సీట్లకు బస్సులోనే రిజర్వేషన్ కల్పించవచ్చు. స్మార్ట్ టికెటింగ్.. పూర్తిగా టచ్ స్క్రీన్ విధానం కావడంతో సులభంగా ఉంటుందని సిబ్బంది అభిప్రాయపడుతున్నారు.

మంచి స్పందన



యూటీఎస్ సేవలకు ప్రయాణికుల నుంచి మంచి స్పందన వస్తోంది. ఎక్స్‌ప్రెస్, డీలక్స్, అల్ట్రా డీలక్స్, ఏసీ బస్సులతోపాటు పల్లె వెలుగు సర్వీసుల్లో ఇటువంటి సేవలతో చిల్లర సమస్య ఉండదు. నగదు చెల్లించి కూడా టికెట్ తీసుకోవచ్చు.

– కె.పద్మావతి, ప్రజా రవాణాశాఖ జిల్లా అధికారి

త్వరలో టీడీపీ దుకాణం బంద్

ఎమ్మెల్సీ టీడీపీ రెబల్ అభ్యర్థి ఈర్లె శ్రీరామమూర్తి



మాట్లాడుతున్న ఈర్లె శ్రీరామమూర్తి

యలమంచిలి: టీడీపీ దుకాణాన్ని చంద్రబాబు త్వరలోనే బంద్ చేసుకుంటాడని ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి టీడీపీ రెబల్ అభ్యర్థిగా పోటీ చేస్తోన్న ఈర్లె శ్రీరామమూర్తి అన్నారు. మాజీ మంత్రి, టీడీపీ నేత అయ్యన్న పాత్రుడు బీసీ ద్రోహి అని, అయ్యన్నలాంటి దగాకోరులతో టీడీపీ భ్రష్టుపట్టిపోయిందని మండిపడ్డారు. తనకు రావలసిన ఎమ్మెల్సీ టికెట్‌ను అయ్యన్న కుట్రలు పన్ని మరో వ్యక్తికి కట్టబెట్టారని ఆరోపించారు. అయ్యన్న భాష వల్ల టీడీపీకి తీరని నష్టం జరుగుతోందన్నారు. త్వరలోనే బీసీల ఉన్నతికి రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం నిర్వహిస్తానని చెప్పారు. చంద్రబాబు తనకు గతంలో చోడవరం ఎమ్మెల్యే టికెట్ ఆఫర్ చేయగా అయ్యన్న మోకాలడ్డాడని..తర్వాత రాష్ట్ర ఆర్టీఐ కమిషన్ సభ్యుడిగా చంద్రబాబు తనను సిఫార్సు చేస్తే తనపై వేరేవారితో గవర్నర్‌కు తప్పుడు ఫిర్యాదులు చేయించి అప్పుడూ అయ్యన్నే అడ్డుకున్నాడని ఆరోపించారు. అయ్యన్నపాత్రుడి బ్లాక్‌మెయిలింగ్ కి చంద్రబాబు లొంగిపోయారని చెప్పారు.

గోదావరి డెల్టాకు అదనపు నీరు విడుదల

సీలేరు: ఉభయగోదావరి జిల్లాల పంట భూములకు సీలేరు విద్యుత్ కాంప్లెక్స్ నుంచి అదనపు నీటిని ఆదివారం రాత్రి విడుదల చేసినట్లు జెన్‌కో సూపరింటెండెంట్ ఇంజినీర్ ప్రశాంత్‌కుమార్ తెలిపారు. రబీ పంటకు అత్యవసరంగా నీటి విడుదల విషయమై నాలుగు రోజుల క్రితం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జెన్‌కో, ఇరిగేషన్ ఉన్నతాధికారులతో సమావేశం నిర్వహించారన్నారు. పంటలకు నీటి ఎద్దడి లేకుండా సకాలంలో నీటిని సరఫరా చేయాలని ఆదేశించినట్టు చెప్పారు. దీంతో సీలేరు కాంప్లెక్స్ డొంకరాయి మెయిన్ డ్యాం నుంచి విద్యుత్ ఉత్పత్తితో సంబంధం లేకుండా నేరుగా గోదావరి డెల్టాకు మూడు వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశామని వివరించారు.

రేపటి నుంచి తెలుగు ప్రాశస్త్యంపై అంతర్జాతీయ సదస్సు



సదస్సు వివరాల బ్రోచర్‌ను విడుదల చేస్తున్న విభాగాధిపతి ఆచార్య జర్రా అప్పారావు

ఏయూక్యాంపస్: ఏయూ తెలుగు విభాగం, సమైక్య భారతి సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం-తెలుగు ప్రాశస్త్యం అనే అంశంపై ఈనెల 21, 22 తేదీల్లో అంతర్జాతీయ సదస్సు నిర్వహించనున్నట్టు తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు తెలిపారు. ఏయూ తెలుగు విభాగం సమావేశ మందిరంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో అంతర్జాతీయ సదస్సు కార్యక్రమ ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ మాతృభాషా ప్రాశస్త్యాన్ని భావితరాలకు వారసత్వ సంపదగా అందించాలనే లక్ష్యంతో ఈ సదస్సు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సదస్సుకు ప్యారిస్ నుంచి ఆచార్య డేనియల్ నేజర్స్, శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు ఆచార్య శలాక రఘునాథశర్మ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ రెక్టార్ ఆచార్య పి.వరప్రసాదమూర్తి, ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, ఆచార్య కప్పగంతుల శ్రీనివాస్ తదితర తెలుగు పండితులు హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ ఆచార్యులు ఆచార్య వెలమల సిమ్మన్న, ఆచార్య జి.యోహాన్ బాబు, సదస్సు సమన్వయకర్తలు డాక్టర్ బూసి వెంకటస్వామి, డా మూర్తి రేమెళ్ల, సమైక్య భారతి జాతీయ సమన్వయకర్త శ్రీ పి.కన్నయ్య పాల్గొన్నారు.

నూకతాత జాతర ప్రారంభం





రాజయ్యపేటలో ఏర్పాటు చేసిన భారీ విద్యుత్ సెట్టింగ్‌లు

నక్కపల్లి: ప్రసిద్ధి గాంచిన రాజయ్యపేట నూకతాత తిరునాళ్లు ఆదివారం ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాల్లో భాగంగా మత్స్యకారులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకొనే నూకతాత పండగను సోమవారం అంగరంగ వైభవంగా నిర్వహిస్తారు. పండగ సందర్భంగా విద్యుత్ దీపాలంకరణ, సెట్టింగులు ఏర్పాటు చేశారు. పూరీ, పారాదీప్, శ్రీశైలం, నందికొండ నాగార్జున సాగర్, ఉప్పాడ, కాకినాడ, శ్రీకాకుళం, ఇచ్ఛాపురం తదితర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులంతా ఆదివారం సాయంత్రానికి రాజయ్యపేట చేరుకున్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సోమవారం ఉదయం నూకతాత విగ్రహాలను సముద్రస్నానానికి తీసుకెళ్తారు. ఈపండగలోభారీ బాణ సంచా కాలుస్తారు.

ప్రయోగ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

- నేటి నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్
- ఈ సారి నాన్ జంబ్లింగ్ విధానంలోనే పరీక్షలు
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 కేంద్రాలు
- హాజరుకానున్న 21,279 మంది విద్యార్థులు



ప్రాక్టికల్స్‌కు సిద్ధమవుతున్న పెందుర్తి కాలేజీ ఒకేషనల్ విద్యార్థులు



విశాఖలో కమాండ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్ఐవో ఉమారాణి

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ప్రయోగ పరీక్షలకు అంతా సిద్ధమైంది. సోమవారం ఒకేషనల్ విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ నెల 26 నుంచి జనరల్ కోర్సుల విద్యార్థులకు ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయి. ఈ సారి విద్యార్థులు చదువుకున్న కాలేజీల్లోనే(నాన్ జంబ్లింగ్) ప్రాక్టికల్ పరీక్షలు నిర్వహిస్తున్న నేపథ్యంలో కేంద్రాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేశారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పరీక్షలు జరుగనున్నాయి. ఈ సీసీ కెమెరాలను ఇంటర్మీడియెట్ ఆర్ఐవో కార్యాలయంతో పాటు, కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేశారు. కేంద్రాల్లోని చీఫ్ సూపరింటెండెంట్, ఇన్విజిలేటర్లతో పాటు, ఉన్నతాధికారులు సైతం పరీక్షలపై నేరుగా పర్యవేక్షణ చేయనున్నారు.

ఉమ్మడి విశాఖలో 21,279 మంది

విశాఖలో 126 కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఇక్కడ ఎంపీసీ 11,079 మంది, బైపీసీ 2,655 మంది విద్యార్థులు ప్రాక్టికల్ పరీక్షలకు హాజరవుతున్నారు. అనకాపల్లిలో 65 కేంద్రాల్లో ఎంపీసీ 4,187 మంది, బైపీసీ 1,575 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 16 కేంద్రాల్లో ఎంపీసీ 1,173 మంది, బైపీసీ 610 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 207 పరీక్ష కేంద్రాల్లో మార్చి 7వ తేదీ వరకు రెండు పూటలా ప్రయోగ పరీక్షలు జరుగుతాయి.

కార్పొరేట్‌కు ఆగడాలకు చెక్ పెట్టేలా..

విద్యార్థులు చదువుకున్న కాలేజీల్లోనే ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తున్నందున మాస్‌కాపీయింగ్‌కు తావులేకుండా ఇంటర్మీడియెట్ బోర్డు ఉన్నతాధికారులు పర్యవేక్షణ పెంచారు. నాన్ జంబ్లింగ్ విధానంలో ప్రాక్టికల్స్ పరీక్షలు నిర్వహిస్తుండటం, 153 ప్రైవేటు కాలేజీల్లో కేంద్రాలు ఉండటంతో ఇలాంటి చోట్ల నిఘా పెంచారు. ఇంటర్మీడియెట్ మార్కుల ప్రాధాన్యత దృష్ట్యా కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ కాలేజీల నిర్వాహకులు విద్యార్థులు ఎక్కువ మార్కులు వేసేలా ఇన్విజిలేటర్లకు ప్రలోభాలకు గురిచేస్తున్నారనే ఆరోపణల నేపథ్యంలో బోర్డు అధికారులు మరింత అప్రమత్తమయ్యారు. మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా సీసీ కెమెరాల పర్యవేక్షణలో ప్రాక్టికల్స్ నిర్వహిస్తున్నారు.

ఏర్పాట్లు పూర్తి చేశాం



ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశాం. కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా శ్రద్ధ తీసుకున్నాం. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుంది. విద్యార్థులకు ఆల్ ద బెస్ట్.

– పి.ఉమారాణి, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

వృత్తి విద్యతో ఉజ్వల భవిష్యత్

- ఇంటర్ చదువుతోనే కొలువు గ్యారెంటీ
- పారామెడికల్ కోర్సులకు డిమాండ్
- కార్పొరేట్ కంపెనీలతో ఒప్పందం
- అప్రెంటిస్ శిక్షణతో అవకాశాలు
- ప్రభుత్వ ఆధ్వర్యంలో విశాఖలో ప్రత్యేక వృత్తి విద్య కాలేజీ
- ప్రైవేటు కాలేజీలకు దీటుగా చదువులు



వృత్తి విద్య కాలేజీలో ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేస్తున్న విద్యార్థినులు

విశాఖ విద్య: యువతరం ఆలోచన దృక్పథం మారుతోంది. స్వశక్తితో సత్వరమే ఆర్థికంగా నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో అనువైన మార్గాలను అన్వేషిస్తున్నారు. సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించే ఇంటర్ వృత్తి విద్య కోర్సుల వైపు మొగ్గు చూపుతున్నారు. విద్యార్థుల ఆసక్తిని దృష్టిలో పెట్టుకొని ప్రస్తుత ట్రెండ్‌కు అనుగుణంగా వృత్తి విద్యలో సరికొత్త కోర్సుల నిర్వహణకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇస్తోంది. కొలువు గ్యారెంటీ కావడంతో నిరుపేద వర్గాలకు చెందిన విద్యార్థులు ఎక్కువగా వృత్తి విద్య కోర్సుల్లో చేరుతున్నారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దేలా ఇంటర్మీడియెట్ బోర్డు అధికారులు ఫోకస్ పెట్టారు.

వృత్తి విద్యకు ప్రత్యేకం

ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన విద్యార్థుల కోసం నగరంలోని మద్దిలపాలెం డాక్టర్ వి.ఎస్.కృష్ణ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో 2008-09 విద్యా సంవత్సరం నుంచి వృత్తి విద్య కోర్సులను నిర్వహిస్తున్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 339 కాలేజీలు ఉండగా, రెగ్యులర్ కోర్సులతో పాటు, పలు కాలేజీల్లో వృత్తి విద్యను సైతం నిర్వహిస్తున్నారు. 2022-23 విద్యా సంవత్సరంలో విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లో 12,551 మంది విద్యార్థులు వృత్తి విద్య కోర్సుల్లో ప్రవేశాలు పొందగా, ఇందులో ఒక్క డాక్టర్ వి.ఎస్. కృష్ణ కాలేజీలోనే 913 మంది చదువుతున్నారు.

పారామెడికల్ కోర్సులకు డిమాండ్

సత్వర ఉపాధి, ఉద్యోగ అవకాశాలు లభించే మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్, మల్టీపర్పస్ హెల్త్ వర్కర్, ఫిజియోథెరపీ వంటి పారామెడికల్ కోర్సులకు విద్యార్థుల నుంచి మంచి డిమాండ్ ఉంది. ఈ కోర్సులకు ప్రైవేటు కాలేజీల్లో అయితే రెండేళ్లకు రూ.30 వేల వరకు వ్యయం అవుతుంది. కానీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహించే కాలేజీల్లో అడ్మిషన్ ఫీజు రూ.2,200, పరీక్ష ఫీజుగా రూ.600 చెల్లిస్తే చాలు. ప్రైవేటు కాలేజీలకు దీటుగా చదువులు సాగుతుండటం, ఫీజు కూడా తక్కువ కావడంతో ప్రభుత్వ కాలేజీల్లో చేరేందుకే విద్యార్థులు మొగ్గు చూపుతున్నారు.

కొలువులు వచ్చేలా కోర్సులు

అకౌంటింగ్ అండ్ ట్యాక్సేషన్, ఆఫీస్ అసిస్టెంట్‌షిప్, బ్యాంకింగ్, రిటైల్ మార్కెటింగ్ వంటి కామర్స్ మెనేజ్‌మెంట్ కోర్సులు చేసిన వారిని ఉద్యోగాల్లో తీసుకునేందుకు కార్పొరేట్ కంపెనీలు ముందుకొస్తుండడంతో వీటికి కూడా మంచి ఆదరణ ఉంది. ఇదే మాదిరిగా మెకానికల్, సివిల్, కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రానిక్, ప్రింటింగ్ టెక్నాలజీ వంటి కోర్సులను కాలేజీల్లో నిర్వహిస్తున్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌పై దృష్టి



ఇంటర్మీడియెట్ స్థాయిలో వృత్తి విద్య అభ్యసించే విద్యార్థులకు ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్లలో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు పొందేలా ఏర్పాట్లు చేశాం. పేరొందిన కార్పొరేట్ కంపెనీలతో ప్రభుత్వం చేసుకున్న ముందస్తు ఒప్పందం మేరకు, వారే కాలేజీలకు వచ్చి విద్యార్థులను ఉద్యోగాల్లో తీసుకుంటున్నారు. కాలేజీల్లో నాణ్యమైన బోధన అందించేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

– ఆర్.సత్యనారాయణ, జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి, విశాఖపట్నం

బోధనపై ప్రత్యేక శ్రద్ధ



వృత్తి విద్యకు ఉన్న ప్రాధాన్యం దృష్ట్యా విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ బోధిస్తున్నాం. గతంలో అప్రెంటిస్ శిక్షణ కోసం విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడేవారు. కానీ ఇప్పుడు ఆ సమస్య లేదు. రెండేళ్ల కోర్సు పూర్తి అయిన తరువాత, ఎక్కడ అప్రెంటిస్ చేయాలనేది ముందుగానే విద్యార్థికి చెబుతున్నాం. అప్రెంటిస్ శిక్షణ సర్టిఫికెట్‌తో పాటు, నెలకు కొంత ఆర్థిక ప్రయోజనం కూడా పొందే అవకాశం ఉంది.

– ఎస్.భీమేశ్వరరావు, ప్రిన్సిపాల్, డాక్టర్ వి.ఎస్.కృష్ణ వృత్తి విద్య కాలేజీ, విశాఖ

అప్రెంటిస్ శిక్షణతో గుర్తింపు



ఎంపీహెచ్‌డబ్ల్యూ కోర్సు చేసిన వారికి గతంలో అప్రెంటిస్ షిప్ అవకాశం లేక, పారామెడికల్ బోర్డు గుర్తింపు ఇచ్చేది కాదు. దీని వల్ల కోర్సు పూర్తి చేసిన విద్యార్థినులు ఇబ్బందులు పడ్డారు. కానీ ప్రస్తుతం ఆ సమస్య లేదు. రెండేళ్ల కోర్సు పూర్తయిన వెంటనే ఆస్పత్రుల్లో శిక్షణకు పంపిస్తున్నాం. పారామెడికల్ బోర్డు గుర్తింపు ఇస్తోంది.

– కె.గౌరి, ఎంపీహెచ్‌డబ్ల్యూ ఫ్యాకల్టీ, విశాఖపట్నం

లోవకు పోటెత్తిన జనం



రెండో రోజూ కిక్కిరిసిన స్నానాల రేవు

- రెండో రోజు రెట్టింపు భక్తులు
- కిక్కిరిసిన స్నానాల రేవు, ఆలయ పరిసరాలు
- వేలాది మందికి అన్నసంతర్పణ, మజ్జిగ వితరణ

రావికమతం: కల్యాణపులోవ తిరునాళ్లకు భక్తులు, యాత్రికులు పోటెత్తారు. ఏటా రెండవ రోజునే యాత్రికులు ఇక్కడకు ఎక్కువగా వస్తుంటారు. ఎందుకంటే మొదటి రోజూ బూది స్నానాలు ఆచరించి, రాత్రంతా జాగరణ చేసి కటుంబ సమేతంగా రెండో రోజు వస్తుంటారు. ఈ కారణంగా శనివారం రాత్రి జాగరణ చేసిన భక్తులు పెద్ద ఎత్తున ఆదివారం వాహనాల్లో తరలివచ్చారు. పుణ్య స్నానాలాచరించారు. ఆపై పోతురాజుబాబు, పెద్దింటమ్మ తల్లి ఆలయాల్లో మొక్కులు చెల్లించుకున్నారు.

రెండో రోజూ మహా అన్నదానం

కల్యాణపులోవ తిరునాళ్లకు వచ్చిన యాత్రికులు, భక్తులకు రెండో రోజూ మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ ఆదేశాల మేరకు నిర్వహించిన 22 కౌంటర్ల ద్వారా భోజన వసతి కల్పించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు నిర్విరామంగా సేవలందించారు.

జాగరణ, రుద్రాభిషేకం

మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా కొత్తకోట గ్రామంలో రాజన్న ఫౌండేషన్ చైర్మన్ పీవీఎస్ఎన్ రాజు ఆధ్వర్యంలో మహా జాగరణ కార్యక్రమం నిర్వహించారు. విశాఖ నుంచి వచ్చిన ప్రత్యేక కళాకారులచే నృత్య కార్యక్రమం ఏర్పాటు చేశారు. కొత్తకోట శివకేశవ ఆలయంలో మహారుద్రాభిషేకం నిర్వహించారు. పోతురాజుబాబు ఆలయం వద్ద తోటకూరపాలెం భక్త భజన బృందం మహిళలు నిర్వహించిన కోలాటం విశేషంగా ఆకట్టుకుంది. ఉదయం నుంచి సాయంత్రం వరకూ 102 భజన పాటలకు కోలాటం ఆడి అబ్బురపరిచారు.

దాహం తీర్చిన మజ్జిగ చలివేంద్రాలు

శనివారం మాదిరి ఆదివారం కూడా భక్తుల దాహార్తిని తీర్చేందుకు మజ్జిక చలివేంద్రాలు కొనసాగాయి. కల్యాణపులోవలో జిల్లా సహకార కేంద్ర బ్యాంకు, విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో, జెడ్.కొత్తపట్నంలో యువకులు, కొత్తకోటలో వాసవి క్లబ్, వనిత క్లబ్, ధర్మవరం మదుము వద్ద గాంధీనగర్ ఫ్రెండ్స్ ఫర్ లైఫ్ యువత, ఉల్లూరి రాజు తదితరులు మజ్జిగ చలివేంద్రాలతో వేలాది మందికి దాహార్తిని తీర్చారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

క్లుప్తంగా

నలుగురు పందెంరాయుళ్ల అరెస్టు

10 కోళ్లు స్వాధీనం

గొలుగొండ: చిన్నయ్యపాలెం గ్రామంలో జరిగిన జానికిలమ్మతల్లి జాతర సందర్భంగా కోడి పందాలు ఆడుతున్న నలుగురిని పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి పది కోడి పుంజులు స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడిలో నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్య ఎస్ఐలు నారాయణరావు, సూర్యనారాయణ పాల్గొన్నారు.

జూదరులపై కేసు

అనకాపల్లిటౌన్: మండలంలోని దిబ్బపాలెం శివారులో లాటరీబల్లాట ఆడుతున్న నలుగురిపై కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు ఆదివారం చెప్పారు. వారి వద్ద నుంచి రూ.3,450 నగదు స్వాధీనం చేసుకున్నట్టు ఆయన తెలిపారు.

పాత ఇనుప దుకాణంలో చోరీ

రూ.1.15 లక్షల నగదు అపహరణ

అనకాపల్లిటౌన్: పాత ఇనుప దుకాణంలో రూ.1.15లక్షల నగదు చోరీకి గురైనట్టు రూరల్ పోలీసులకు శనివారం ఫిర్యాదు అందింది. రూరల్ ఎస్ఐ సీహెచ్.నర్సింగరావు తెలిపిన మేరకు వివరాలు..మండలంలో మారేడుపూడి గ్రామానికి చెందిన బొండా శంకరరావు అదే గ్రామంలో పాత ఇనుప దుకాణం నిర్వహిస్తున్నారు. షాపు అభివృద్ధి కోసం తన తల్లివద్ద ఉన్న బంగారు నగలను ఈనెల 17న విశాఖ కో–ఆపరేటివ్ బ్యాంక్‌లో కుదవపెట్టి రూ.1.15 లక్షలు అప్పుగా తీసుకున్నారు. అదేరోజు రాత్రి తల కింద నగదును పెట్టుకుని దుకాణంలో నిద్రపోయాడు. 18వ తేదీ తెల్లవారు జామున నిద్రనుంచి లేచి చూసేసరికి నగదు, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ కనిపించలేదు. చోరీ జరిగినట్టు గుర్తించి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.

జిల్లా జట్టుకు శ్రేయాన్, లాశ్రిత

విశాఖ స్పోర్ట్స్: జిల్లా చదరంగం జట్ల ఎంపిక పోటీల్లో శ్రేయాస్, లాశ్రిత, ఆర్యన్, జాగృతి సత్తా చాటారు. అండర్–7 బాలురకు నాలుగు రౌండ్లు, బాలికలకు మూడు రౌండ్లలో పోటీలు నిర్వహించారు. బాలురలో శ్రేయాస్ నాలుగు పాయింట్లతోనూ, రాజేష్ మూడు పాయింట్లతోనూ, బాలికల్లో లాశ్రిత మూడు పాయింట్లు, పూజిత రెండు పాయింట్లతో జిల్లా జట్టుకు ఎంపికయ్యారు. ఆల్ విశాఖ చదరంగం సంఘం ఆధ్వర్యంలో సృజన స్కూల్‌లో ఆదివారం ఈ పోటీలు నిర్వహించగా 64 మంది పోటీపడ్డారు. ఆయా విభాగాల్లో తొలి రెండు స్థానాల్లో నిలిచిన వారు జిల్లా జట్టుకు అర్హత కల్పించగా.. వీరు అంతర జిల్లాల చదరంగం చాంపియన్‌షిప్‌లో పాల్గొనున్నారు.

సంగీత ఝురి.. పేలూరి



మాడుగులలో హరికథా గానాలాపనలో హార్మోనియం వాయిస్తున్న దృశ్యం



క్లారినెట్‌పై పాటల పోటీలకు సంగీతం వాయిస్తున్న నారాయణరావు

- రాష్ట్ర వ్యాప్తంగా 500పైగా స్టేజ్ షోలు
- సంగీత వాద్యకారుడిగా వెంకట నారాయణరావు ప్రాచుర్యం
- క్లారినెట్, సాక్సోఫోన్, కీబోర్డుపై ప్రావీణ్యత

మాడుగుల రూరల్: సంగీత కళారంగంలో తండ్రికి తగ్గ తనయుడిగా పేలూరి వెంకట నారాయణరావు శభాష్ అనిపించుకుంటున్నారు. తన మధురమైన స్వర కల్పనతో ఎంతోమంది సంగీత ప్రియుల హృదయాలను దోచుకున్నారు. సాంఘిక, రంగస్థల ప్రదర్శనల్లో వాద్యకారుడిగా వైవిధ్యమైన సంగీతాన్ని అందిస్తూ ఉర్రూతలూగిస్తున్నారు. ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 500కుపైగా స్టేజ్ ప్రదర్శనల్లో వినసొంపైన బాణీలతో మైమరిపించారు.

తండ్రి నుంచి సంగీత ఓనమాలు నేర్చుకుని..

మాడుగుల గ్రామానికి చెందిన వెంకట నారాయణరావు తండ్రి సాంబమూర్తి క్లారినెట్ సంగీతంలో దిట్ట. ఈ నేపథ్యంలో ఐదో తరగతిలోనే సంగీతంపై మక్కువ పెంచుకున్న నారాయణరావు అప్పటి నుంచి తన తండ్రి వద్ద శిష్యరికం చేసి నేర్చుకున్నారు. ప్రధానంగా క్లారినెట్, సాక్సోఫోన్, కీబోర్డు ప్లే, హార్మోనియం వాయించడంలో నైపుణ్యం సాధించారు. తర్వాత చోడవరంలో చింతలపాటి వరహాలురాజు వద్ద పూర్తిస్థాయిలో తర్ఫీదు పొందారు.

సంగీత వాద్యకారునిగా ప్రాచుర్యం...

హరికథ, బుర్రకథలతోపాటు జానపద గీతాలకు, గయోపాఖ్యానం, రామాంజనేయ యుద్ధం, తదితర రంగస్థల నాటకాలకు హార్మోనియం వాయించడంలో ప్రాచుర్యం పొందారు. రాష్ట్రంలో గుంటూరు, కాకినాడ, శ్రీకాకుళం, విజయనగరం, కడప, తదితర దూర ప్రాంతాల్లో నిర్వహించే ప్రదర్శనల్లో పాల్గొన్నారు. ఆయన ప్రావీణ్యతకు రాష్ట్రంలో పలు చోట్ల అవార్డులు, సన్మానాలు లభించాయి. చోడవరం జవహర్ క్లబ్‌లో 2015లో ఉగాది పురస్కారంతో ఘనంగా సన్మానించారు. 2017లో కాకినాడలో నంది నాటకోత్సవంలో అవార్డు పొందారు. గతంలో మాజీ మంత్రులు రెడ్డి సత్యనారాయణ, అయ్యన్నపాత్రుడుల నుంచి ఘన సన్మానాలు పొందారు. రాష్ట్ర వ్యాప్తంగా 500కుపైగా ప్రోగ్రామ్స్‌లో సంగీత వాద్యకారునిగా క్లారినెట్, సాక్సోఫోన్, కీబోర్డు ప్లే, హార్మోనియం మీద వాయించారు.

విద్యార్థులకు ఉచిత శిక్షణ

ఖాళీ సమయంలో స్థానిక విద్యార్థులకు ఉచిత సంగీత శిక్షణ ఇస్తున్నారు. వీటితోపాటు వివాహాలు, ఇతర శుభకార్యాల్లోనూ పాల్గొని వివిధ సంగీత వాయిద్యాల మీద ఇంపైన బాణీలు వినిపించి ఆకట్టుకుంటున్నారు.

కళారంగాన్ని ప్రోత్సహించాలి



ప్రస్తుతం కనుమరుగవుతున్న రంగస్థల కళారంగాన్ని ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఈ కళ మీద ఆధారపడి జీవిస్తున్న కళాకారులను ఆదుకోవాలి. ప్రభుత్వం పింఛను మంజూరు చెయ్యాలి.

– పేలూరి వెంకట నారాయణరావు, సంగీత వాద్యకారుడు, మాడుగుల

సరుగుడు వద్ద సందడి



సరుగుడు జలపాతానికి వెళ్తున్న సందర్శకులు

నాతవరం: మండలంలో సరుగుడు జలపాతానికి ఆదివారం సందర్శకులు పోటెత్తారు. ఉమ్మడి విశాఖపట్నం, తూర్పుగోదావరి జిల్లాల నలుమూలల నుంచి అధిక సంఖ్యలో సందర్శకులు రావడంతో ఈ ప్రాంతంలో సందడి వాతావరణం నెలకొంది. ఉదయం నుంచి సాయంత్రం వరకు స్నానాలు చేస్తూ ఆటపాటలతో గడిపారు. ప్రత్యేక బస్సులు, వాహనాలపై సందర్శకులు రావడంతో నాతవరం, సరుగుడు మధ్య ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జలపాతాన్ని సందర్శించిన అనంతరం సందర్శకులు తాండవ రిజర్వాయర్‌ను చూసేందుకు రావడంతో ఈ ప్రాంతమంతా కోలాహలంగా మారింది. ట్రాఫిక్ అంతరాయం లేకుండా నాతవరం ఎస్ఐ డి.లక్ష్మీనారాయణ చర్యలు తీసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



గాయపడిన కొండలరావు

మాడుగుల: మండలంలోని డి.సురవరం మోదకొండమ్మ ఆలయం వద్ద శనివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ఎస్ఐ దామోదరనాయుడు తెలిపిన వివరాలు.. మండలంలో ఎం.కోడూరు గ్రామానికి చెందిన సీహెచ్. కొండలరావు లోతుగెడ్డ పీహెచ్‌సీలో సీనియర్ సహాయకుడిగా పనిచేస్తూ విశాఖపట్నంలో నివాసముంటున్నాడు. ఆదివారం సెలవు కావడంతో ఆయన విశాఖ నుంచి ఎం.కోడూరుకు శనివారం రాత్రి తన బైక్ మీద బయలుదేరాడు. డి.సురవరం మోదకొండమ్మ ఆలయం సమీపంలో బైక్ అదుపుతప్పడంతో కిందపడిపోయాడు.దీంతో తీవ్రంగా గాయపడ్డాడు.స్థానిక సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం ఆయనను విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

పొక్లెయిన్ ఢీకొని వృద్ధుడి మృతి



ప్రమాదంలో మృతిచెందిన దేముడు

కె.కోటపాడు: కింతాడలోని రామచంద్రపురం వద్ద శనివారం రాత్రి పొక్లెయిన్ ఢీకొని కూండ్రపువానిపాలెం గ్రామానికి చెందిన నెక్కల దేముడు(80) అనే వృద్ధుడు మృతిచెందాడు. పినగాడి నుంచి కె.కోటపాడు వైపు వస్తున్న పొక్లెయిన్ అదే మార్గంలో పాన్‌షాపునకు వచ్చి ఇంటికి నడుచుకుని వెళ్తున్న దేముడును ఢీకొంది. తీవ్రంగా గాయపడిన ఆయనను 108 వాహనంలో కె.కోటపాడు సీహెచ్‌సీకి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించాడు. మృతుడి కుమారుడు నెక్కల ఈశ్వర నరసింహ అప్పలనాయుడు ఫిర్యాదు మేరకు కె.కోటపాడు ఎస్ఐ ఆర్.ధనుంజయ్ కేసు నమోదు చేశారు. అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో ఆదివారం మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి బంధువులకు అప్పగించినట్టు ఎస్ఐ తెలిపారు. మృతుడి భార్య, కుమారుడు ఉన్నారు.

ఎస్ఐ ప్రిలిమినరీ పరీక్షకు 87.7 శాతం హాజరు



పరీక్ష కేంద్రానికి వస్తున్న విద్యార్థులు



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న సీపీ

అల్లిపురం (విశాఖ దక్షిణం): ఎస్ఐ ప్రిలిమినరీ రాత పరీక్ష నగరంలో ఆదివారం ప్రశాంతంగా జరిగింది. 35 పరీక్షా కేంద్రాల్లో ఉదయం 10 నుంచి 1 గంట వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్–2 పరీక్ష నిర్వహించారు. మొత్తం 87.7 శాతం అభ్యర్థులు పరీక్ష లకు హాజరయ్యారు. పరీక్షా కేంద్రాల వద్ద ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, అభ్యర్థులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నగర పోలీస్ కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ ఆధ్వర్యంలో పరీక్షా కేంద్రాల వద్ద పోలీసులు పటిష్ట భద్రత ఏర్పాటు చేశారు. ఏయూలో పరీక్ష కేంద్రాన్ని పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ స్వయంగా పరిశీలించారు.

సాగరతీరంలో సాహస క్రీడలు

- జీ– 20 సదస్సు నేపథ్యంలో టూరిజం శాఖ సన్నాహాలు
- ఆర్‌కే బీచ్‌లో పారాసెయిలింగ్, పారా మోటర్ ఫ్లైయింగ్
- సాగర్ నగర్, రుషికొండలో ఆల్టేరియన్ వెహికల్స్
- ఎన్నికల కోడ్ నేపథ్యంలో అనుమతి కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాసేందుకు సన్నద్ధం



పారా సెయిలింగ్

సాక్షి, విశాఖపట్నం: అంతర్జాతీయ పర్యాటకానికి చిరునామాగా గుర్తింపు పొందిన విశాఖ నగరంలో వాటర్ స్పోర్ట్స్, సాహస క్రీడలు పరిచయం చేసేందుకు ప్రభుత్వం సమాయత్తమవుతోంది. మార్చిలో 3, 4 తేదీల్లో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్–2023, మార్చి 28, 29 తేదీల్లో జీ–20 అంతర్జాతీయ సదస్సులు జరగనున్నాయి. ఈ తరుణంలో ప్రపంచ దేశాల ప్రతినిధులకు నగరం ఆతిథ్యమివ్వనుంది. దాదాపు 7 నుంచి నెల రోజుల పాటు వారంతా నగరంలోనే బస చేయనున్నారు. ఇందుకోసం విశాఖలోని ప్రధానమైన నక్షత్రాల హోటళ్లలో గదులను రిజర్వ్ చేశారు. సదస్సులు అనంతరం ఉమ్మడి విశాఖ జిల్లాల పరిధిలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాలను విదేశీ ప్రతినిధులు సందర్శించనున్నారు. ఇందుకనుగుణంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది. నగర పరిధిలోని పర్యాటక ప్రాంతాలతో పాటు ఏజెన్సీలోని ప్రముఖ టూరిస్ట్ స్పాట్లు అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

డీటీసీ సమావేశంలో కీలక నిర్ణయాలు

- జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు తయారు చేసేందుకు కలెక్టర్ మల్లికార్జున నేతృత్వంలో ఇటీవలే నిర్వహించిన జిల్లా టూరిజం కౌన్సిల్(డీటీసీ) సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు.
- రుషికొండ ప్రాంతంలో యోయో రైడ్స్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేశారు. యోయో రైడ్స్ కోసం స్థలం అవసరం ఉన్న నేపథ్యంలో పర్యాటక శాఖకు సంబంధించిన స్థలాన్ని వెంటనే కేటాయించే వీలు లేనందున.. రెవెన్యూ విభాగానికి చెందిన స్థలాలను పరిశీలిస్తున్నారు. యోయో రైడ్స్‌కు అవసరమైన స్థలాలను గుర్తించి వాటిని టూరిజం శాఖకు బదలాయించనున్నారు.
- పారా సెయిలింగ్, పారా మోటార్ ఫ్లైయింగ్, ఏటీవీ బైక్స్‌ను ఏర్పాటు చేసేందుకు కూడా సన్నద్ధమవుతున్నారు. సదరు సంస్థ ప్రతినిధులు ఈ రెండింటికీ ఆర్‌కేబీచ్ అనుకూలమని నిర్ణయించారు. ఈ బీచ్ జీవీఎంసీ పరిధిలో ఉన్న నేపథ్యంలో సంబంధిత అధికారులతో త్వరలోనే బీచ్‌ను పరిశీలించి.. ఏ ప్రాంతం ఈ రెండు సాహస క్రీడలకు అనుకూలమో నిర్ణయం తీసుకోనున్నారు.
- నీరు, రోడ్డు, ఇసుక, గుట్టలపైనా రైడ్ చేయగలిగేలా ఆల్టేరియన్ వెహికల్స్‌ను కూడా పరిచయం చేయనున్నారు. ఇప్పటికే దీనికి సంబంధించి ఏపీటీడీసీ ఆధ్వర్యంలో టెండర్లు ఖరారు చేశారు. ఈ టెండర్లను సన్ అడ్వెంచర్స్ సంస్థ దక్కించుకుంది. సాగర్‌నగర్, రుషికొండ తీరాల్లో వీటిని నడపనున్నారు. త్వరలోనే ఇవి కూడా పర్యాటకులకు అందుబాటులోకి రానున్నాయి. ఈ ఆల్టేరియన్ వెహికల్స్‌ను ఆర్కే బీచ్‌లోని టూరిస్టుల కోసం ఏర్పాటు చేయాలని డీటీసీ భావిస్తోంది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాలను పర్యాటక శాఖ అధికారులు పరిశీలిస్తున్నారు.

ఈ సరికొత్త పర్యాటక అనుభూతులు పరిచయం చేసేందుకు వడివడిగా అడుగులు వేస్తున్న తరుణంలో ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేసింది. త్వరలోనే గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌తో పాటు జీ–20 సమావేశాలు ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో ముందస్తు ప్రోగ్రామ్ షెడ్యూల్ ఖరారైంది. అందుకే ఈ పర్యాటక ప్రాజెక్టుల ప్రారంభానికి అనుమతి కోసం ఎన్నికల సంఘానికి లేఖ రాసేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. ఎన్నికల సంఘం నుంచి ఎలాంటి అభ్యంతరాలు రాకపోతే సదస్సుల ప్రారంభానికి ముందే సాహస పర్యాటకం పర్యాటకులకు అందుబాటులోకి రానుంది.

బిడ్డకు జన్మనిచ్చిన మతిస్థిమితం లేని మహిళ

ఆదుకున్న ఏయూటీడీ సిబ్బంది



చంటిబిడ్డతో ఏయూటీడీ సిబ్బంది, కేజీహెచ్ వైద్యులు



షెల్టర్‌లో ఆశ్రయం పొందుతున్న మతి స్థిమితం లేని మహిళ

అల్లిపురం: మతిస్థిమితం లేని మహిళ చంటిపాపకు జన్మనిచ్చింది. ఆమెకు జీవీఎంసీ ఏయూటీడీ టీఎస్సార్ కాంప్లెక్స్ అధికారులు అండగా నిలిచారు. రెండు నెలల కిందట మతి స్థిమితం లేని గుర్తు తెలియని మహిళ అల్లిపురంలో తిరుగాడుతుండగా దిశ పోలీసులు గుర్తించి.. ఏయూటీడీ అధికారులకు సమాచారం ఇచ్చారు. గత డిసెంబర్ 28న ఏయూటీడీ సిబ్బంది అక్కడికి వెళ్లి ఆమెను టీఎస్సార్ వుమెన్ షెల్టర్‌లో ఆశ్రయం కల్పించారు. కొంత మంది మృగాళ్లు వంచించడంతో ఆమె గర్భవతి అయినట్లు గుర్తించారు. దీంతో ఆమెకు సరైన పౌష్టికాహారం, మందులు అందజేశారు. కేజీహెచ్ వైద్యుల సహకారంతో ఈ నెల 6న శస్త్రచికిత్స చేశారు. ఆమె పాపకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారు. పాపను శిశుగృహాలో చేర్పించి.. తల్లిని యథావిధిగా టీఎస్సార్ మహిళా షెల్టర్‌కు తీసుకొచ్చి సరంక్షిస్తున్నారు.

మాస్సే డైనాస్టార్ పోటీ-2023లకు దరఖాస్తుల ఆహ్వానం

బీచ్‌రోడ్డు: వ్యవసాయ రంగంలో వినూత్న ఆలోచనలకు పట్టంకట్టేందుకు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్‌మెంట్ లిమిటెడ్ (టాఫె) శ్రీకారం చుట్టింది. మాస్సే డైనాస్టార్–2023 పోటీలను నిర్వహిస్తున్నట్టు ట్రాక్టర్స్ అండ్ ఫార్మ్ ఎక్విప్మెంట్ సంస్థ ఎండీ మల్లికా శ్రీనివాసన్ ఓ ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం కోసం వినూత్న పరిష్కారాలు, మెళకువలు, డైనాట్రాక్ వినియోగం, సమాజాన్ని విస్తృత స్థాయి లో ప్రభావం చేసే అంశాలను వినూత్నమైన రీతిలో 10 నిమిషాల మించకుండా వీడియోను రూపొందించి పంపాలన్నారు. పోటీలో పాల్గొనాలనుకునే వారు https://masseyfergusonindia. com/ DYNASTAR/ వెబ్‌సైట్‌లో ఈ నెల 27లోగా రిజిస్టర్ చేసుకోవాలని సూచించారు. విజేతకు రూ.7.5లక్షల విలువైన బహుమతి, షార్ట్ లిస్ట్ అయిన వారికి రూ.5 వేల విలువైన బహుమతులు అందజేస్తామన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

ఎస్.రాయవరం: మేడపై నుంచి జారిపడిన వ్యక్తి చికిత్స పొందుతూ కేజీహెచ్‌లో మృతిచెందినట్టు హెడ్ కానిస్టేబుల్ భూలోకరావు ఆదివారం తెలిపారు. ఈ మేరకు హెచ్‌సీ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. రామయ్యపట్నం గ్రామానికి చెందిన పంపరబోయిన లోవరాజు(38), జనవరి 19న తన ఇంటి మేడపై నిద్రిస్తూ మధ్యలో మేడ దిగే క్రమంలో జారి పడ్డాడు. ఈ మేరకు మృతుని భార్య పంపరబోయిన ధనలక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముందుగా నక్కపల్లి, తర్వాత అనకాపల్లి ప్రభుత్వాస్పత్రిలో చికిత్స అందించారు. మెరుగైన వైద్యంకోసం విశాఖపట్నం కేజీహెచ్‌కు తరలించారు. కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పేర్కొన్నారు.

సినిమా షూటింగ్ సందడి



హీరో, హీరోయిన్లపై చిత్రీకరిస్తున్న దృశ్యం

జి.మాడుగుల: మండలంలోని కొత్తపల్లి జలపాతం వద్ద శనివారం రాత్రి సినిమా షూటింగ్ సందడి నెలకొంది. సినీనటుడు బ్రహ్మాజీ తనయుడు సంజీవరావు హీరోగా, అయుశా హీరోయిన్‌గా నటిస్తున్న నూతన చిత్రం 'గుట్టు చప్పుడు'లో ఒక పాటను ఇక్కడ చిత్రీకరించారు. ఈ సినిమాకు డైరెక్టర్‌గా మణింద్రన్, ప్రొడ్యూసర్‌గా లివింగ్‌స్టన్, డ్యాన్స్ మాస్టర్‌గా ప్రశాంత్ వ్యవరిస్తున్నారు.

విషాదం నింపిన సరదా

- సముద్రంలో ఇద్దరు మత్స్యకార యువకుల గల్లంతు
- రెండు కుటుంబాల్లో విషాదఛాయలు





అనిల్, ప్రవీణ్ కుమార్ (ఫైల్)



తీరంలో యువకుల కుటుంబ సభ్యులు, గ్రామస్తులు

ఎంవీపీకాలనీ: సముద్రంలో షికారు చేయాలని భావించిన కొందరి సరదా.. రెండు కుటుంబాల్లో ఆవేదనకు కారణమైంది. కుటుంబానికి అందొచ్చిన ఇద్దరు యువకుల జీవితాన్ని ప్రశ్నార్థకం చేసింది. అప్పుఘర్‌లోని మూలపాలేనికి చెందిన ఉమ్మిడి అనిల్ (23), మరుపల్లి ప్రవీణ్ కుమార్ (22) ఆదివారం సముద్రంలో గల్లంతవ్వడంతో పండగ పూట నగరంలో విషాదం నెలకొంది. పోలీసులు తెలిపిన వివరాలివీ..

గల్లంతైన ఉమ్మిడి అనిల్ తండ్రిని కోల్పోగా.. తల్లి ఉమ్మిడి ధనమ్మ సంరక్షణలో జీవనం సాగిస్తున్నాడు. నాలుగేళ్ల కిందట అనిల్‌కు పెళ్లి కాగా ఇద్దరు మగ బిడ్డలు ఉన్నారు. కొన్నేళ్లుగా చేపల వేటకు వెళుతూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గల్లంతైన మరో యువకుడు మరుపల్లి ప్రవీణ్‌కుమార్‌కు తల్లిదండ్రులు నూకరత్నం, చిన్నయ్య ఉన్నారు. కొన్నాళ్లుగా వుడ్ వర్క్ పనులకు వెళుతూ కుటుంబానికి చేదోడుగా ఉంటున్నాడు. కుటుంబానికి అందొచ్చిన వీరు ఇద్దరూ సముద్రంలో గల్లంతు కావడంతో మూలపాలెంలో విషాదఛాయలు అలముకున్నాయి. ఇరువురి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటనపై సమాచారం తెలియగానే ఎంవీపీ పోలీసులు గాలింపు చర్యలు మొదలు పెట్టారు. కోస్ట్‌గార్డ్ నౌకలను రంగంలోకి దించి వారి కోసం గాలిస్తున్నారు. కుటుంబ సభ్యులు, మూలపాలెం గ్రామస్తులు యువకుల కోసం వాసవానిపాలెం తీరంలో నిరీక్షిస్తున్నారు.

అసలేం జరిగిందంటే..

శివరాత్రి పుణ్యస్నానాల నేపథ్యంలో మూలపాలేనికి చెందిన దాసరి కొండ బోటును భక్తుల భద్రత కోసం సాగర్‌నగర్ తీరంలో పోలీసులు ఏర్పాటు చేశారు. అనిల్ తన యజమాని దాసరి కొండ బోటుతో సాగర్‌నగర్ తీరంలో ఆదివారం మధ్యాహ్నం వరకు భక్తుల భద్రతకు కాపలాగా వ్యవహరించాడు. విధులు ముగిసిన అనంతరం 2 గంటలకు అప్పుఘర్ తీరానికి రావడంతో స్నేహితుడు ప్రవీణ్ కుమార్ కలిశాడు. ఇద్దరూ కలిసి బోటులో డీజిల్ నింపి యాంకర్ వేయాలని భావించారు. డీజిల్ తేవడానికి బయలుదేరారు. ఇంతలో అప్పుఘర్ తీరానికి స్నానానికి వచ్చిన 15 మంది వరకు స్థానిక మహిళలు, పురుషులు సముద్రంలోకి తీసుకెళ్లాలని కోరడంతో సరేనన్నారు. సరదాగా ఓ రౌండ్ తిప్పి వద్దామని తీసుకెళ్లారు. సముద్రంలో కొంత దూరం వెళ్లాక కొందరు పురుషులతో పాటు ఈత రాని ప్రవీణ్ స్నానం చేసేందుకు దిగి మునిగిపోయాడు. దీన్ని గమనించిన అనిల్.. ప్రవీణ్‌ను కాపాడేందుకు దిగిన క్రమంలో ఇద్దరూ గల్లంతైపోయారు. లోతైన ప్రాంతం కావడంతో ఇద్దరూ పైకి రాలేదు. మిగతా వారు బోటుతో తీరానికి చేరుకుని పోలీసులకు సమాచారం అందించారు.

పుష్కలంగా మంచినీరు

- జి.భీమవరంలో ఇంటింటికీ కుళాయి కనెక్షన్లు
- చురుగ్గా జరుగుతున్న పనులు



జి.భీమవరం పంచాయతీ కార్యాలయం.. పక్కన రక్షిత మంచినీటి పథకం



జి.భీమవరం భూగర్భంలో ఏర్పాటు చేస్తున్న పైపులైన్



ఇంటింటికీ ఇస్తున్న కుళాయి కనెక్షన్లు

కశింకోట: మండలంలోని జి.భీమవరంలో ఇంటింటి కుళాయి కనెక్షన్ల ద్వారా మంచినీరు అందించడానికి చురుగ్గా సన్నాహాలు జరుగుతున్నాయి. ఇప్పటికే పైపులైన్లు ఏర్పాటు చేసి కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. జి.భీమవరంలో సుమారు 400 గృహాలున్నాయి. గ్రామం నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డుకు ఆనుకుని రెండు వైపులా విస్తరించి ఉంది. పంచాయతీ కార్యాలయం, సచివాలయం ఉన్నాయి. ఇక్కడ సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన హనుమంతు వెంకట్, ఎంపీటీసీ సభ్యునిగా అల్లం శంకరరావు వ్యవహరిస్తున్నారు. గ్రామంలో గతంలో 230 వరకు ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇచ్చారు. మరో 160 ఇళ్లకు కనెక్షన్లు ఇవ్వాల్సి ఉంది. ఈ నేపథ్యంలో జల్ జీవన్ మిషన్ కింద రూ.14 లక్షల నిధులు మంజూరయ్యాయి. దీంతో పనులు చేపట్టారు. దీనిలో భాగంగా గ్రామంలోను, పక్కన కాలనీలోను భూగర్భ పైపులైన్ వేసే పనిని చేపట్టి చురుగ్గా నిర్వహిస్తున్నారు. పైపులైన్ వేయడంతో పాటు కుళాయి లేని ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తున్నారు. ఇంటింటి కుళాయి కనెక్షన్లు లేని వారు నీటికోసం వీధి కుళాయిలపైనే ఆధారపడుతున్నారు. గ్రామంలో పంచాయతీ కార్యాలయం వద్ద రక్షిత మంచినీటి పథకం ఉంది. దీనికి నీటి సరఫరా కోసం బోరు ఏర్పాటు చేశారు. అలాగే ప్రత్యామ్నాయంగా ఏలేరు కాలువ నీటిని శుభ్రపరిచి అందిస్తున్న సంపతిపురం భారీ రక్షిత మంచినీటి పథకం కూడా ఉంది. పైపులైన్ ద్వారా ఇక్కడి రక్షిత పథకం ట్యాంకుకు నీరు సరఫరా అవుతోంది. దీంతో తాగునీటి సమస్య లేకుండా సమృద్ధిగా నీరు సరఫరా అవుతోంది. గ్రామంలో పాక్షికంగా కొన్ని ఇళ్లకు ఇంటింటి నీరు సరఫరా చేస్తున్నారు. ఇప్పుడు కొత్తగా ఇస్తున్న కుళాయి కనెక్షన్ల ద్వారా నీటి సరఫరా ప్రారంభమైతే గ్రామం అంతటికి ఇంటికే నీరు చేరువ కానుండటంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆనందంగా ఉంది



ఇంత వరకు మా ఇంటికి కుళాయి కనెక్షన్ లేదు. వీధి కుళాయిల వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నాం. ఇప్పుడు ఇంటింటి కుళాయి కనెక్షన్ ఇచ్చి నీరు సరఫరా చేయడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. త్వరలోనే నేరుగా మా ఇంటికే కుళాయి నీరు రానుండడం ఆనందంగా ఉంది.

–హనుమంతు గణేష్, జి.భీమవరం.

ఇళ్లన్నింటికీ కుళాయి కనెక్షన్లు ఇస్తాం

జి.భీమవరం గ్రామంలో అన్ని ఇళ్లకు ఇంటింటి కుళాయి కనెక్షన్లు ఇవ్వడానికి చర్యలు తీసుకుంటున్నాం. రూ.14 లక్షల జల్ జీవన్ మిషన్ కింద మంజూరైన నిధులతో భూగర్భంలో పైపులైన్ వేసి కనెక్షన్లు లేని సుమారు 160 ఇళ్లకు కుళాయి కనెక్షన్లు ఇస్తున్నాం. త్వరలోనే నీటి సరఫరాకు చర్యలు తీసుకుంటాం.

–బి.చిన్నోడు, పంచాయతీ కార్యదర్శి, జి.భీమవరం

ఘనంగా కల్యాణం పోతురాజుబాబు ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో కల్యాణం పోతురాజుబాబు విగ్రహం

కశింకోట: మండలంలోని తీడ గ్రామంలో ఆదివారం సాయంత్రం కల్యాణం పోతురాజుబాబు ఉత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆలయాన్ని, స్వామి వారిని అందంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సర్పంచ్ చిరికి సత్యనారాయణ ఆధ్వర్యంలో డప్పులు, వాయిద్యాలతో కర్ర గుర్రాలపై గ్రామ పెద్దలను గ్రామం నుంచి ఏలేరు కాలువ పక్కన ఉన్న ఆలయం వరకు ఊరేగించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవంలో తిను బండారాలు, అలంకరణ వస్తువులు, పిల్లల ఆట వస్తువుల అమ్మకాలు జోరుగా జరిగాయి. స్థానికులతో పాటు చుట్టు పక్కల గ్రామాల నుంచి ప్రజలు వచ్చి ఉత్సాహంగా ఉత్సవంలో పాల్గొన్నారు. విద్యుద్దీపాలంకరణ ఏర్పాటు చేశారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

క్లుప్తంగా

వినాయక దేవాలయం ప్రథమ వార్షికోత్సవం



అన్నసమారాధన కార్యక్రమంలో వడ్డిస్తున్న దాడి రత్నాకర్

అనకాపల్లిటౌన్ : స్థానిక రింగ్‌రోడ్డు శ్రీ గౌరీసంపత్ వినాయక దేవాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్సార్ సీపీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ పాల్గొని, మహాగణపతి హోమం నిర్వహించారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత దైవభక్తి కలిగి ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొణతాల శేషు, భీశెట్టి రవి, ఆడారి రవికుమార్, గాడి మాధురినాయుడు, గిరి, ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి కల్యాణం



అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మన్మథరావు

అనకాపల్లిటౌన్: పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో శనివారం రాత్రి స్వామి, గోవిందమాంబ అమ్మవారి కల్యాణం ఘనంగా జరిగింది. ఈ కల్యాణంలో వ్యాపారవేత్తలు కె.సురేష్, దుర్గ అమ్మాజీ, పి.కృష్ణమూర్తి, రాణీమణి దంపతులు పాల్గొన్ని స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అనంతరం ఆదివారం పట్టణ కామాక్షి కార్పెంటర్ సంఘం శాశ్వత గౌరవాధ్యక్షుడు కోసూరి మన్మథరావు మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంఘం గౌరవాధ్యక్షుడు ఎండపల్లి మోహన్‌బ్రహ్మాజీ, అధ్యక్షుడు వానపల్లి కోటేశ్వరరావు, కోశాధికారి ఎం.రామకృష్ణ, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించాలి

అనకాపల్లిటౌన్: ఉత్తరాంధ్ర జిల్లాల పీడీఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెండ్ల రమాప్రభను గెలిపించాలని 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బొడ్డు గంగాధరరావు కోరారు. స్థానిక గాంధీనగరం, విజయరామరాజుపేట, శ్రీరామ్‌నగర్‌లో ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ రైల్వే జోన్ సాధనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తామని, నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని, విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టభద్రులు ఉమామహేశ్వరరావు, జంపా రమేష్, శాస్త్రి, రంగబాబు, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

సార్	- రాజా
అమిగోస్	-సత్యనారాయణ స్క్రీన్-1
క్వాంటమేనియా(3డీ)	- సత్యనారాయణ స్క్రీన్-2
వినరో భాగ్యము విష్ణుకథ	-షిర్డిసాయి
క్వాంటమేనియా(3డీ)	-పర్తిసాయి
వీరసింహారెడ్డి	-వెంకటేశ్వర
శ్రీదేవి శోభన్‌బాబు	- శ్రీసత్య
వాల్తేరు వీరయ్య	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 85 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-10 యూనిట్లు, బీ పాజిటివ్-40 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్ 28 యూనిట్లు, ఓ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 218 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న 101 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

23న రోటరీ క్లబ్ ఆవిర్భావ దినోత్సవం

అనకాపల్లిటౌన్ : రోటరీ క్లబ్ 118వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఈ నెల 23న నిర్వహించనున్నట్లు అనకాపల్లి రోటరీ క్లబ్ ప్రాజెక్టు చైర్మన్ కడిమిశెట్టి సతీష్, క్లబ్ అధ్యక్షుడు సానా త్రినాథ్, కార్యదర్శి పెంటకోట రాజేష్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. క్లబ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆ రోజు ఉదయం 9 గంటలకు గాంధీనగరం జీవీఎంసీ హైస్కూల్, భీమునిగుమ్మం హైస్కూళ్లలో ఈ ఏడాది పదోతరగతి పరీక్షలకు హాజరుకానున్న విద్యార్థులు, పెన్నులు, ఎగ్జామ్ ప్యాడ్‌లు, స్కేళ్లు అందజేస్తామన్నారు. మెయిన్‌రోడ్డులోని కన్యకాపరమేశ్వరి దేవాలయంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో, న్యూకాలనీ రోటరీ కల్యాణ మండపంలో నిరుపేదలకు పలు సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. పట్టణ, మండల పరిధిలో గత ఏడాది పదోతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన 20మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పుల పంపిణీ, ఒకేషనల్ కోర్సుల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన 20 మంది విద్యార్థులను సత్కరించనున్నట్లు వెల్లడించారు.

బ్యాడ్మింటన్ ఎంపికల్లో నునపర్తి క్రీడాకారుల ప్రతిభ



ప్రతిభ కనబరిచిన నునపర్తి బాల్ బ్యాడ్మింటన్ క్రీడాకారులు

అచ్యుతాపురం : బాల్ బ్యాడ్మింటన్ జిల్లా జట్ల ఎంపికలో అచ్యుతాపురం మండలం నునపర్తి శ్రీరామా బాల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ క్రీడాకారులు ప్రతిభ చాటారు. వచ్చే నెల నెల్లూరు జిల్లా కావలిలో నిర్వహించనున్న అంతర్ జిల్లాల బాల్ బ్యాడ్మింటన్ పోటీల్లో పాల్గొనే జట్ల ఎంపికకు టి.అర్జాపురంలో చేపట్టిన క్యాంప్‌లో నునపర్తి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు బి. ప్రసాద్, కె. హేమకుమార్, ఎం.లయ, రాధా స్రవంతి, కళ్యాణి, హైమావతి, రాజ్యలక్ష్మి, హిమబిందు, ప్రశాంతి, పి. సుస్మాశ్రీలను అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు పెదపూడి శంకర్‌రావు, ప్రధాన కార్యదర్శి మాసవరపు అప్పారావు, కోచ్ డి. శ్రీనివాస్, అధ్యక్షుడు గొంప నరసింహనాయుడు ఆదివారం జరిగిన కార్యక్రమంలో అభినందించారు.

అంధుల పాఠశాలకు నిత్యావసరాల పంపిణీ



అంధులకు నిత్యావసర సరకులు అందజేస్తున్న సన్యాసినాయుడు

అనకాపల్లిటౌన్: బగుడు, బలహీన వర్గాల అనాథ పిల్లలను ఆదుకోవడం ఎంతో సంతృప్తినిస్తుందని గౌరీ పంచాయతన దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు అన్నారు. గవరపాలెం గౌరీపంచాయతన ఆలయంలో పెందుర్తి మండలం వేపగుంట అంధుల పాఠశాలకు చెందిన విద్యార్థులకు ఆదివారం రూ. 30 వేలు విలువ చేసే నిత్యావసర వస్తువులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది మహా శివరాత్రి మరుసటి రోజున ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, పాలకవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పదిలో మెరుగైన ఫలితాలకు 'కృషి'



కొరుప్రోలు ఉన్నత పాఠశాలలో పరీక్ష రాస్తున్న విద్యార్థులు



పరీక్షల నిర్వహణ తీరును పరిశీలిస్తున్న ఉపవిద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

ఎస్.రాయవరం : పదో తరగతి విద్యార్థులు పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి-50 రోజుల కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని ఉపాధ్యాయులు చెప్తున్నారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశాల మేరకు ఫిబ్రవరి 13 నుంచి 50 రోజులు పాటు ఉన్నత పాఠశాలల్లో టెన్త్ విద్యార్థులకు అదనపు తరగతులు, వారాంతపు పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, సైన్స్ పరీక్షలు నిర్వహించారు. ఆదివారం సెలవురోజైనప్పటికీ పిల్లల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుని ఉపాధ్యాయులు బోధనపై దృష్టి సారించడంపై తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

పాయకరావుపేట: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల, కేహెచ్ వాడ ఉన్నత పాఠశాలలను ఉపవిద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్‌కుమార్ ఆదివారం సందర్శించారు. కృషి కార్యక్రమంలో భాగంగా ఆదివారం జరిగిన ఇంగ్లిష్, సైన్స్ పరీక్షల నిర్వహణను పరిశీలించారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు, విద్యార్థులకు తగు సూచనలు, సలహాలు అందించారు.

విజయం చిన్నదైనా స్ఫూర్తి అనంతం



విద్యార్థులను అభినందిస్తున్న విజయ్ ప్రకాష్

పాయకరావుపేట: విద్యార్థులను వారి అభిరుచి మేరకు చిన్నతనం నుంచే ప్రోత్సహిస్తే అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తారని శ్రీప్రకాష్ విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి విజయ్‌ప్రకాష్ అన్నారు. శ్రీప్రకాష్ విద్యా సంస్థల నుంచి వివిధ పోటీల్లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచిన విద్యార్థుల అభినందన సభ ఆదివారం స్థానిక స్కూల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విజయ్ ప్రకాష్ మాట్లాడుతూ విద్యార్థులకు స్కూల్ స్థాయి నుంచే విజయకాంక్ష ఉంటుందని, కేవలం చదువులోనే కాకుండా వారిని ఇతర రంగాల్లో కూడా ప్రోత్సహించాలని సూచించారు. విజయం చిన్నదైనా, అదిచ్చే స్ఫూర్తి అనంతమని, అందుకే జ్ఞాపికలు కుండా ప్రపంచంలో గొప్ప విజయాలు సాధించిన వ్యక్తుల జీవిత చరిత్ర పుస్తకాలను బహుమతులుగా అందిస్తున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎంవీవీఎస్ మూర్తి, భానుమూర్తి, డా.కె.వీ రాజు, ప్రధానోపాధ్యాయులు, బహుమతులు పొందిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముగిసిన మహా శివరాత్రి వేడుకలు

అనకాపల్లిటౌన్: పట్టణం, మండలంలో గల పలు శివాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు శనివారం రాత్రి ముగిసాయి. మహాశివరాత్రి ఉపవాస దీక్షలు, జాగరణ, శివనామ స్మరణతో శనివారం రాత్రి 12 గంటలకు మొదలైన ఆదిదేవుడి పూజలు, అభిషేకాలు ఆదివారం ఉదయంతో ముగిసాయి. స్థానిక వేల్పుల వీధి కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి పాలు, పెరుగు, తేనే, నెయ్యి, పంచదార, పళ్ల రసాలు, విభూది, గంధం, పన్నీరు, అత్తరు, సెంటుతో చేపట్టిన సామూహిక అభిషేకాల్లో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గవరపాలెం భోగలింగేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి మహామృత్యుంజయ రుద్రహోమం నిర్వహించారు. అరటిపళ్ల మార్కెట్ వద్ద మహాకాళేశ్వర దేవాలయంలో (సాధువుల గుడి)లో క్షీరాభిషేకాలు, రుద్రాభిషేకాలు నిర్వహించారు. మెయిన్‌రోడ్డు సిద్ధిలింగేశ్వరస్వామి ఆలయం, శారదానది ఒడ్డున ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలో రుద్రహోమాలు నిర్వహించారు. లక్ష్మీదేవిపేట పాత్రుడుకాలనీ ఆదిశేషు 11 అడుగుల శివలింగంతో పాటు 12 లింగాలకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గవరపాలెం గౌరీ పంచాయతన ఆలయం, చిన్నరాజుపేటలో చౌడేశ్వరీ ఆలయాల్లో శివలింగానికి అభిషేకాలు నిర్వహించారు. ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు స్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సోహం ఆశ్రమంలో..

తుమ్మపాల: అనకాపల్లి మండలం బట్లపూడి సోహం ఆశ్రమంలో శనివారం రాత్రి పార్వతీపరమేశ్వరుల కల్యాణం ఘనంగా జరిగింది. భక్తులు తరలివచ్చి ఆశ్రమం శివసన్నిధిలో పంచామృతాభిషేకం, బిల్వార్చన పూజలు నిర్వహించారు. సర్పంచ్ గొంతిన సజ్జావతి, సత్యవతి, ఎల్లు నూకరాజు, కాండ్రేగుల దీనబంధు దంతులు ప్రత్యేక అర్చనలు చేశారు.



వేల్పులవీధి గౌరీపరమేశ్వరుల ఆలయంలో ఏర్పాటు చేసిన మంచులింగాన్ని దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి దంపతులు

కశింకోటలో..

కశింకోట: కశింకోటలోని శివాలయాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన మహాశివరాత్రి పూజలు ఆదివారం ముగిశాయి. స్థానిక శివాలయంలో శివలింగాన్ని లింగోద్భవ పూజల అనంతరం అందంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. లింగోద్భవ పూజలను లైవ్‌లో పెద్ద తెరపై ప్రదర్శించడంతో ప్రజలు భక్తిశ్రద్ధలతో వీక్షించారు. ఆలయ అర్చకుడు వి.శంకరం, వి.చిదంబరం, వి.కృష్ణ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు జరిగాయి. కస్బావీధిలోని ఉమా సాంబశివుని ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. స్వామి ఉత్సవ విగ్రహాలను మహిళా కోలాటాలు, డప్పులు, వాయిదాలతో గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. వెదురుపర్తిలోని రామలింగేశ్వరస్వామి ఆలయం, బయ్యవరం, పేరంటాలపాలెం, తాళ్లపాలెం, సోమవరం, కన్నూరుపాలెం, నూతలగుంటపాలెం గ్రామాల్లోని శివాలయాలు, చింతలపాలెంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, ఉగ్గినపాలెంలోని ఉమా సోమేశ్వరస్వామి ఆలయం, ఏఎస్ పేటలోని సాంబశివుని ఆలయం, బంగారయ్యపేటలోని బసవేశ్వరస్వామి ఆలయం, సాంబమూర్తి ఆలయాల్లో కూడా శివరాత్రి ముగింపు పూజలు జరిగాయి.



గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయం వద్ద ఏర్పాటు చేసిన మంచులింగం



వేల్పులవీధి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



కశింకోటలో ఉమా సాంబశివుని ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

నేడు బెనర్జీరావు సంతాప సభ

అనకాపల్లిటౌన్: విశ్రాంత హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు, ఇస్కాప్ పట్టణ అధ్యక్షుడు స్వర్గీయ కర్రి బెనర్జీరావు సంతాప సభ సోమవారం సాయంత్రం 4 గంటలకు స్థానిక నెహ్రూచౌక్ వై.విజయకుమార్ హాల్లో నిర్వహిస్తున్నట్లు ఇస్కాప్ జిల్లా ప్రధాన కార్యదర్శి మళ్ల మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. బెనర్జీరావు అభిమానులు, విశ్రాంత ఉపాధ్యాయులు, ఇస్కాప్ సభ్యులు హాజరు కావాలని కోరారు.

వేడుకగా పెళ్లిరాట



మునగపాక లింగరాయి గుడిలో పెళ్లిరాట

మునగపాక : మండల కేంద్రమైన మునగపాక మెయిన్‌రోడ్డులోని లింగరాయి గుడిలో ఆదివారం పెళ్లిరాట మహోత్సవం భక్తి శ్రద్ధల మధ్య ఘనంగా జరిగింది. కాశీ విశాలాక్షి సహిత విశ్వేశ్వరస్వామి వివాహ కార్యక్రమంలో భాగంగా వేద పండితులు సోమశేఖరశర్మ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. శివరాత్రి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాట మహోత్సవంలో ఆలయ చైర్మన్ సూరిశెట్టి రాము, పెంటకోట జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

గుర్రాల పోటీ విజేత రామన్నపాలెం



తీడలో గుర్రం పరుగు పోటీలు నిర్వహిస్తున్న దృశ్యం

కశింకోట: మండలంలోని తీడలో ఆదివారం సాయంత్రం జరిగిన ఉత్తరాంధ్ర స్థాయి గుర్రం పరుగు పోటీల్లో అచ్యుతాపురం మండలం రామన్నపాలేనికి చెందిన గుర్రం ప్రథమ బహుమతి గెలుచుకుంది. కల్యాణం పోతురాజుబాబు ఉత్సవాన్ని పురస్కరించుకుని ఈ పోటీలు నిర్వహించారు. కాకినాడ జిల్లా పెద్దాపురానికి చెందిన గుర్రం ద్వితీయ, భీమిలికి చెందిన గుర్రం తృతీయ, భీమిలికి చెందిన మరో గుర్రానికి నాలుగో స్థానం లభించాయి. ఈ మేరకు వాటి నిర్వాహకులకు నగదు బహుమతులను ఎస్ఐ ఎ. ఆదినారాయణరెడ్డి అందజేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్, సర్పంచ్ చిరికి సత్యనారాయణ, దుంగల అప్పలనాయుడు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు దుంగల అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిరపలో నల్ల తామర పురుగు

రాంబిల్లి : మిరప పంటను నల్ల తామర పురుగు ఆశించినట్టు హరిపురం కేవీకే సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ తెలిపారు. పలు గ్రామాల్లో మిరప పంటను పరిశీలిస్తే నల్ల తామర పురుగు ప్రభావం కనిపించిందన్నారు. రైతులు సకాలంలో ఈ పురుగు నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ పురుగు పూత దశలో రసం పీల్చివేయడం ద్వారా పిందె కట్టకుండా చేస్తుందన్నారు. మిరపతో పాటు పెసర, మినుము పంటల్లో కూడా ఈ నల్ల తామర పురుగు కనిపించినట్టు పేర్కొన్నారు. ఎకరాకు 8 కిలోల చొప్పున ఫిప్రోనిల్ గుళికలను తగినంత తేమ ఉన్నప్పుడు వేసుకోవాలన్నారు. ఎకరాకు 10 పసుపు రంగు, 10 నీలం రంగు జిగురు అట్టలను పొలంలో కట్టాలని సూచించారు. అవసరం బట్టి 2 మిల్లీ లీటర్ల ఫిప్రోనిల్ మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే ప్రయోజనం ఉంటుందన్నారు.

ఆకట్టుకున్న దీపాలంకరణ



దీపాలతో శివలింగం

మునగపాక : మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా మునగపాక సాంబశివుని ఆలయ ప్రాంగణంలో దీపాలతో ఏర్పాటు చేసిన శివలింగం అలంకరణ అందరినీ ఆకట్టుకుంది. మహిళలు వందల సంఖ్యలో ప్రమిదలను నూనె, ఒత్తి వేసి వెలిగించి, శివపంచాక్షరీ మంత్ర పఠనంతో శివలింగాకృతిని నిలిపారు. ఆలయ కమిటీ చైర్మన్ బూడిద శ్రీనివాసరావు ఆధ్వర్యంలో దీపాలంకరణ జరిగింది.